క్లుప్తంగా

లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్

కొందుర్గు: విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకొని చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో గురువారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేష్‌పటేల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రస్తుతం పోటీతత్వాన్ని తట్టుకొని చదవాలన్నారు. లక్ష్యంతో చదివిన వ్యక్తి ఏ రంగంలోనైనా రాణిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జోసెఫ్, ఉప సర్పంచ్ రాజారమేష్‌రెడ్డి, నాయకులు మానయ్య, లింగం, సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ అందజేత



వాటర్ డిస్పెన్సర్‌ను అందజేస్తున్న దాత వంశీకృష్ణ

కేశంపేట: తహసీల్దార్ కార్యాలయానికి వాటర్ కూలర్‌ను కొమిరిశెట్టి వంశీకృష్ణ గురువారం అందజేశారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి మంచినీటిని అందించాలనే ఉద్దేశంతోనే వాటర్ డిస్పెన్సర్‌ను అందించినట్లు వంశీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజీంఅలీ, ఆనంద్‌రావు, ఆర్ఐ నివేదిత, కొడిపర్తి శ్రీకాంత్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మున్నూర్ యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వీధికీ సిమెంట్ రోడ్డు



సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు ప్రతి ఊరిలో వీధి వీధినా సిమెంటు రోడ్లు నిర్మించడం జరిగిందని వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో గురువారం సిమెంట్ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కృషితో మండలంలోని అన్ని గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేయడం జరిగిందన్నారు. ప్రజలు సహకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, యాదయ్య, కృష్ణయ్య, దామోదర్, రాములు, రాజేష్, శ్రీను, నర్సింలు, శ్రీశైలం, ప్రశాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలకు ఉప్పల ట్రస్టు చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన నక్క రాములు, పెంటమోల మాధవులు, కోల వెంకటేశ్ ఇటీవల ఇండ్ల నిర్మాణాలను చేపట్టారు. అయితే డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణాలను నిలిపివేశారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను కలుసుకొని ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. గురువారం ట్రస్టు సభ్యులచే ఇంటి నిర్మాణాలకు ఇసుక, సిమెంట్, స్టీల్, తదితర మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, అంజయ్య, రాజశేఖర్, చందు, మహేష్, మల్లయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన ఈసరి రాములు ఇటీవల మృతి చెందాడు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఫౌండేషన్ సభ్యులచే గురువారం రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, శ్రీనివాస్, సర్పంచ్ అనురాధ, నరేందర్‌గౌడ్, ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, భరత్, విజయ్, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

300 మందికి కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్, పెద్దూర్‌తండాలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 300 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు కల్పన, స్నేహ, సైదమ్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్రు, కిషన్, ఎంపీటీసీ రఘునాయక్, హెచ్ఏలు మల్లయ్య, రామచంద్రయ్య, నాగమల్లీశ్వరి, రవికుమార్, శివకుమార్, మల్లిఖార్జున్, రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వడగండ్ల వాన.. దెబ్బతిన్న పంటలు



ఆలూరులో పడిన వడగండ్లు



అమ్డాపూర్ చౌరస్తాలో కురుస్తున్న భారీ వర్షం

మొయినాబాద్: వడగండ్లతో కూడిన అకాల వర్షం పంటలను దెబ్బతీసింది. గురువారం మధ్యాహ్నం మొయినాబాద్ మండల కేంద్రంతో పాటు సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, పెద్దమంగళారం, చిలుకూరు, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, కుత్బుద్దీన్‌గూడ, ఎలుకగూడ, మేడిపల్లి, నాగిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. వర్షంతో పాటు వడగండ్లు పడడంతో ఆయా గ్రామాల్లోని కూరగాయ పంటలు టమాట, వంకాయ, బెండ, పూల పంటలు నీటి మునిగాయి. పంటలన్నీ దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేవెళ్లలో...

చేవెళ్ల మండల కేంద్రంతో పాటు ఆలూరు, కౌకుంట్ల, అంతారం, న్యాలట, రామన్నగూడ తదితర గ్రామాల్లో వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షం పడడంతో పంటలు నష్ట పోయాయి.



షాబాద్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్‌లో

మొయినాబాద్‌రూరల్: ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం గురువారం మధ్యాహ్నం ఆయా గ్రామాల్లో భారీగా కురిసింది. మండల పరిధిలోని అమ్డాపూర్‌లో హనుమాన్ దేవాలయ ఆవరణలోని ధ్వజస్తంభం ఉరుములు, మెరుపులు గాలివాన దుమారానికి విద్యుత్ తీగలపై పడింది. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో గ్రామంలోని ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైయ్యారు. అమ్డాపూర్‌తో పాటు కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, కనకమామిడి, అజీజ్‌నగర్, బాకారం, ఎన్కెపల్లి, హిమాయత్‌నగర్ ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమైయ్యాయి.

షాబాద్‌లో కురిసిన చిరుజల్లులు

షాబాద్: మండలంలో గురువారం చిరుజల్లులు కురిశాయి. గత మూడు రోజుల నుంచి భానుడు ప్రతాపం ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఎండ వేడిమికి బయటకు రావడం లేదు. మధ్యాహ్నం తర్వాత చిరుజల్లుల వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. గాలివానకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

విత్తన ఎంపికలో నాణ్యత తప్పనిసరి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



సింజెంటా సీడ్స్ పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కంపెనీ ప్రతినిధులు

కేశంపేట: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని అధిక దిగుబడులను పొందాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సూచించారు. మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ విశ్వనాథం వ్యవసాయ పొలంలో సింజెంటా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు రైతులకు క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సింజెంటా కంపెనీ సీడ్స్‌ను పరిశీలించారు. రైతులు ఆధునిక వ్యవసాయం తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, నవీన్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, మల్లేష్ యాదవ్, నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, వెంకటయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చిన్నమంగళారం గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ కొడుకు ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా మట్టి తరలించి తన సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై వారం రోజుల క్రితమే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూమిలో నుంచి మట్టి తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో గ్రామస్తులు ఆంజనేయులుగౌడ్, వెంకటేష్, శంకర్, పద్మరావు, శ్రీకాంత్, రాజు తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులతో నిజాన్ని దాచలేరు



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

బీజేపీ జిల్లా నాయకుడు అశోక్‌గౌడ్

కొత్తూరు: అక్రమ అరెస్టులతో బీఆర్ఎస్ ప్రభుత్వం నిజాలను దాచలేరని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి అశోక్‌గౌడ్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో ఆదే కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్‌ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. ఆయన అరెస్ట్‌ను నిరసిస్తూ గురువారం కొత్తూరు పట్టణంలోని ప్రధాన కూడలిలో బీజేపీ, బీజేవైఎం నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అధికారులు చేసే తప్పిదాలకు విద్యార్థులు, నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల పరిపాలనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అందుకే పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీలు అవుతున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి మోసాలు, అన్యాయాలపై ప్రశ్నించే నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. లీకేజీ వ్యవహారంపై ఉన్నతాధికారులతో విచారణ జరిపి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం బీజేవైఎం నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, మాణిక్యం, రణధీర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, సాయి, రాఘవేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. డీఎం అశోక్‌రాజు సూచన మేరు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ వ్యాపారి ఎర్రమల్ల శ్రీనివాస్ ఈ చలివేంద్రానికి రోజు నీటిని పంపిణీ చేయనున్నారు. చలివేంద్రం ఏర్పాటుపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి కేవీ రమేష్‌రాజు, వసునూరి వినోద్, ఆర్టీసీ ఉద్యోగి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

21న తైబజారు వేలం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ 2023–24 సంవత్సరానికి తైబజారు వేలం ఈనెల 21న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.2.50 లక్షలు డీడీ తీసి ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు మున్సిపల్ కార్యాలయంలో అందించాలని ఆయన సూచించారు.

అరకొర వసతులతో డబుల్ ఇళ్లు

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను గురువారం బీజేపీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీ ఏమైందని విమర్శించారు. నిర్మించిన ఇళ్లు పంపిణీ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ప్రభుత్వం పేదలకు ఇళ్లను పంపిణీ చేయకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్ సౌకర్యం సరిగాలేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను అధికార పార్టీ కార్యకర్తలకు కాకుండా అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇళ్లు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారు. కానీ, ప్రభుత్వం అరకొరగా ఇళ్లు నిర్మించి ఏవిధంగా పంపిణీ చేస్తుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, అశోక్, శ్రీనివాస్, మురళీ, వెంకటేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించండి

- అంగన్‌వాడీ టీచర్ల, సీఐటీయూ జిల్లా సభ్యురాలు కవిత
- హిమాయత్‌నగర్‌లో సామూహిక శ్రీమంతాలు



సామూహిక శ్రీమంతాలు నిర్వహిస్తున్న కవిత

మొయినాబాద్‌రూరల్: గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటే పుట్టబోయే బిడ్డ, తల్లి క్షేమంగా ఉంటారని సీఐటీయూ అంగన్‌వాడీ టీచర్ల జిల్లా సభ్యురాలు కవిత అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ అంగన్‌వాడీ–2 కేంద్రంలో సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కవిత పాల్గొని శ్రీమంతాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గర్భిణులు, చిన్నపిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, సునీతా, సంతోషి, అంగన్‌వాడీ ఆయా విజయ, రజనీ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి

వాసవీ క్లబ్ అధ్యక్షుడు నవీన్‌కుమార్



షాద్‌నగర్: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

షాద్‌నగర్‌టౌన్: దేశ స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించిన పొట్టి శ్రీరాములు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షాద్‌నగర్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు గార్లపాటి నవీన్‌కుమార్ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం షాద్‌నగర్ పట్టణంలో వాసవీ, వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కేశంపేట చౌరస్తాలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గార్లపాటి నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. సేవ, నిస్వార్థం మూర్తీభవించిన మహామూర్తి పొట్టి శ్రీరాములని కొనియాడారు. యువత పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి ప్రాణాలర్పించారని చెప్పారు. పొట్టి శ్రీరాములు చేసిన సేవలను మహాత్మాగాంధీ కూడా కొనియాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షురాలు దివ్య, వెంకటరమణ, శ్రీనివాస్, హరిబాబు, రాంచంద్రుడు, నరేందర్, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి



పాఠశాల ప్రహరీగోడ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలకు తన సొంత నిధులు రూ.2లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ గోడలకు మ్యూరల్ ఆర్డర్ ద్వారా రంగు రంగుల బొమ్మలను చిత్రీకరించారు. స్కూలు పిల్లలను ఆకర్షించే విధంగా, వివిధ రకాల చిత్రాలను గోడలపై వేయించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే పేద విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందన్నారు. తాము సంపాదించిన దాంట్లో కొంత డబ్బు పేద విద్యార్థుల కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్ర ప్రసాద్ ఆయన పాఠశాలకు వచ్చినప్పుడు 5 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం 35 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్న చెప్పారు. ఇంటింటికి తిరిగి విద్యార్థులను పాఠశాలకు తీకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులున్నారు.

'రణభేరిని జయప్రదం చేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌నాయక్

కడ్తాల్: ఈనెల 26న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'జై భారత్ సామాజిక విప్లవ రణభేరి'ని జయప్రదం చేయాలని, జై భారత్ ఎస్టీ పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. జై భారత్ ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట వేదికలు లక్ష్య సాధన కోసం.. కలిసి వచ్చే మరిన్ని సంస్థలతో ఐక్యంగా పనిచేసేందుకు సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవనంలో రణభేరిని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐక్యవేదిక ద్వారా సామాజిక న్యాయం, కుల నిర్మూలనే లక్ష్యంగా.. కలిసి పనిచేసేందుకు ప్రతి ఒక్కరూ సభకు రావాలని కోరారు. కార్యక్రమంలో మైసిగండి సర్పంచ్ తులసీరాం నాయక్, జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లి రాములు ఉన్నారు.

మొదటిరోజు ప్రశాంతం



శంకర్‌పల్లి: ఆదర్శ పాఠశాల వద్ద పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం

శంకర్‌పల్లి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, చైతన్య జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, వాసవీ ఒకేషనల్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. మండలంలో మొత్తం 712మంది విద్యార్థులకు గాను 689మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 23మంది గైర్హాజరయ్యారు. కాగా, ఒకేషనల్‌లో మొత్తం 160మంది విద్యార్థులకు గాను 27మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 133మంది విద్యార్థులు పరీక్ష రాశారని కస్టోడియన్ వసంత పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మొయినాబాద్/చేవెళ్ల: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చేవెళ్లలో ఇంటర్ సెకండియర్ పరీక్షలకు నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 237 మందికి గాను 232 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అదే విధంగా వివేకానంద జూనియర్ కళాశాలలో 185 మందికి 180 మంది, శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో 201 మందికి గాను, 191 మంది, ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 354 మందికి 346 మంది పరీక్షకు హాజరయ్యారు. అదే విధంగా మొయినాబాద్ మండల కేంద్రంలోని సిద్దార్థ జూనియర్ కళాశాల, చాలెంజర్ జూనియర్ కళాశాల, మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే విద్యార్థులు చేరుకున్నారు.



మొయినాబాద్/చేవెళ్ల: పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

85 మంది విద్యార్థులు గైర్హాజరు

షాద్‌నగర్‌టౌన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. అధికారులు షాద్‌నగర్‌లో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 2155 మంది విద్యార్థులకు గాను 2070 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 85 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 390 మంది విద్యార్థులకు గాను 376మంది, మొగిలిగిద్ద ప్రభుత్వ కళాశాలలో 181మంది విద్యార్థులకు గాను 177 మంది, ప్రతిభ కళాశాలలో 322 మందికి గాను 308మంది, విశ్వభారతీ కళాశాలలో 306 మందికి గాను 297 మంది, విజ్ఞాన్ కళాశాలలో 401మందికి గాను 388 మంది, విజేత జూనియర్ కళాశాలలో 326 మందికి గాను 306మంది, శ్రీ సాయి ఒకేషనల్ కళాశాలలో 229మందికి గాను 218 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల కస్టోడియన్ అధికారులు శ్రీకాంత్, కిష్టప్పలు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

తలకొండపల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు భోజనంలో ఆకుకూరలు, పాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలో ఇచ్చే బాలమృతం, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జంగయ్య, పర్యవేక్షకులు మమత, అంగన్‌వాడీ టీచర్ సుమిత్ర, బౌరమ్మ, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.